సాక్షి
ఒడిశా

గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తుల కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,44,501లు, బంగారం 2 గ్రాముల 950 మిల్లీగ్రాములు వెండి 57గ్రాముల 900 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఆయుధ ప్రదర్శన

కొరాపుట్ జిల్లా కేంద్రంలో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) అధికారులు ఆయుధ ప్రదర్శనను బుధవారం నిర్వహించారు.

- 8లో



రైల్వే ఉద్యోగం పేరుతో మోసం

రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తిని మల్కన్‌గిరి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

కార్యకర్త ఇంట్లో సీఎం భోజనం



భువనేశ్వర్: భువనేశ్వర్‌లోని పాఖోరిపుట్ ప్రాంతంలో పార్టీ కార్యకర్త ఇంట్లో రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి బుధవారం మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా చద్దన్నంతో తోటకూర, ఒడియాలు, పుట్ట గొడుగుల బెసారు, వంకాయ ముద్ద కూర, కల గూర ఆరగించడంపై కార్యకర్త కుటుంబ సభ్యులు ఆనందంతో ఉప్పొంగిపోయారు.

బాలికపై సామూహిక అత్యాచారం

భువనేశ్వర్: సుందరగడ్ జిల్లా రౌర్కెలా మైనర్ బాలికలపై సామూహిక అత్యాచారాల ఘటనలతో అట్టుడికిపోతోంది. తాజాగా మంగళవారం రాత్రి మైనర్ బాలికని 5 మంది మిత్ర బృందం సామూహికంగా అత్యాచారం చేసినట్లు ఆరోపణ. ఇటీవల ఉక్కు నగరం రౌర్కెలాలో ఇద్దరు మైనర్ బాలికలపై ముగ్గురు సామూహికంగా అత్యాచారానికి పాల్పడిన ఘటన నుంచి కోలుకోక ముందే, తాజాగా మరో సంఘటన జరగడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటువంటి సంఘటనల నివారణకు కట్టుదిట్టంగా చట్టపరమైన చర్యలను చేపడతామని రాష్ట్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ అభయం ఇస్తున్న తరుణంలో మైనర్ బాలికలు అత్యాచారాలకు బలికావడం ఆందోళన కలిగిస్తోంది. రౌర్కెలా ప్లాంటు సైట్ పోలీసు ఠాణా పరిధిలో మంగళవారం రాత్రి మైనర్ బాలికపై 5 మంది సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఇద్దరు మిత్రులతో కలిసి రఘునాథపల్లి పోలీసు ఠాణా పరిధిలో రెస్టారెంటుకు వెళ్లిన బాలిక ఈ అఘాయిత్యానికి బలి అయింది. ప్లాంటు సైట్ పోలీసు ఠాణా శివారులో నిర్మానుష్య ప్రాంతానికి బాలికని దారి మళ్లించి ఇద్దరు మిత్రులతో మరో 3 మంది కలిసి సామూహికంగా అత్యాచారం చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

రాష్ట్రంలో జేపీ నడ్డా పర్యటన నేడు



భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. పార్టీ సభ్యత్వం పురోగతి సమీక్ష పురస్కరించుకుని ఒకరోజు పర్యటనకు గురువారం విచ్చేస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆయన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర శాఖ ప్రముఖులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇతరేతర ప్రముఖ వర్గాలతో జాతీయ అధ్యక్షుడు ప్రత్యక్షంగా సమావేశం కానున్నారు. గురువారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ సమావేశం కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తెలిపారు.

ఇద్దరి వ్యక్తులకు 12 ఏళ్ల జైలు శిక్ష

పర్లాకిమిడి: ఎన్‌డీపీఎస్ కేసులో దొరికిన ఇద్దరు ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆలీఘడ్‌కు చెందిన వ్యక్తులకు జిల్లా స్పెషల్ సెషన్స్ కోర్టు జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ 12 ఏళ్ల జైలు శిక్ష, చెరొక రూ.లక్ష జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెల్లడించారు. 2021 అక్టోబర్ 3వ తేదీన గజపతి జిల్లా అడవ పోలీసుస్టేషన్ పరిధి రాయిపంక వద్ద ఒక గ్రానైట్ లోడులో 2,013 కిలోల గంజాయి (70 బస్తాలు) అక్రమంగా రవాణా చేస్తుండగా ఇద్దరు పట్టుబడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ట్రక్కు డ్రైవర్ రాజు, హెల్పర్ రవి గ్రానైట్ లోడు చేసి, గజపతి జిల్లా అడవ పంచాయతీ రాయి పంకలో గంజాయి బస్తాలు ఎక్కించుకుని వస్తుండగా పోలీసులకు దొరికిపోయారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద నిందితులపై కేసు నమోదు చేసి, వాహనం సీజ్ చేశారు. అప్పటి అడవ పోలీసుస్టేషన్ ఎస్ఐ ఆనంద చంద్ర పాత్రో కేసును విచారించారు. తదుపరి ఈ కేసును డీఎస్పీ ర్యాంకు దిలీప్ కుమార్ నాయక్, ఎస్ఐ రుషికేష్ పండా దర్యాప్తు చేశారు. వాదనలు విన్నటువంటి జిల్లా జడ్జి ప్రణబ్ కుమార్ రౌత్రాయ్ నిందితులు ఇద్దరికీ 12 ఏళ్ల జైలు శిక్ష విధించారు. అలాగే జరిమానా కట్టకుంటే మరో ఏడాది పాటు జైలు శిక్ష నిందితులు అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.



వరద బాధితులకు అండగా..!

- ఆర్థిక సాయం ప్రకటించిన ప్రభుత్వం
- బాధితులందరికీ సాయం అందేలా చర్యలు
- పూర్తిగా దెబ్బతిన ఇళ్లకు రూ.1.20 లక్షల పరిహారం
- ప్రకటించిన సీఎం మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రంలో ఇటీవల సంభవించిన వరదలతో భారీ నష్టం సంభవించింది. ప్రధానంగా బాలాసోర్ జిల్లాలో పంటలు, ఇళ్లు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. దీంతో బాధితులకు ప్రభుత్వ సాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ప్రకటించారు. పూర్తిగా దెబ్బ తిన్న ఇళ్లకు రూ.1.20 లక్షలు, పాక్షికంగా దెబ్బతిన్న పక్కా ఇళ్లకు రూ. 6,500, మట్టి ఇళ్లకు రూ.4 వేలు చొప్పున ఆర్థిక సాయం లభిస్తుందని పేర్కొన్నారు. జల దిగ్బంధంలో చిక్కుకున్న బాధితులకు దుస్తులు, వంట పాత్రల కోసం చెరో రూ.2,500 చొప్పున ఆర్థిక సాయం అందుతుందన్నారు.

రైతులకు మేలు

పంట నష్టానికి గురైన చిన్న, సన్నకారు రైతాంగానికి 1 హెక్టారు విస్తీర్ణపు వర్ష ఆధార పొలాల్లో పంట నష్టానికి రూ.8,500, సాగు నీటి వనరుల పొలాల్లో పంట నష్టానికి హెక్టారు విస్తీర్ణానికి రూ.17 వేలు, నిత్య పంట పొలాలకు హెక్టారుకు రూ.22,500 చొప్పున పరిహారం లభిస్తుంది. అయితే ఈ సాయం గరిష్ట పరిమితి 2 హెక్టార్లకు మాత్రమే పరిమితంగా పేర్కొన్నారు. ఇసుక మేట వేసిన పంట పొలాలకు పరిహారం కింద అతి తక్కువగా రూ.2200, గరిష్టంగా రూ.18 వేలు సన్నకారు, బలహీన రైతాంగానికి చెల్లిస్తారు. నదిగట్లు తెగి పొలాల్లో వరద నీరు పొంగిపొర్లి నష్టం ఏర్పడిన పరిస్థితుల్లో పీడిత వర్గాలకు కనీస పరిహారం రూ.5,000 కాగా, గరిష్ట పరిహారం రూ.47 వేలుగా పేర్కొన్నారు.

మత్స్యకారులకు ప్యాకేజీ

వరదల ప్రభావంతో మత్స్యకారులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. పూర్తిగా దెబ్బ తిన్న చేపల వేట పడవకు రూ.15 వేలు, పాక్షికంగా దెబ్బతిన్న పడవలకు రూ.6 వేలు చొప్పున పరిహారం చెల్లిస్తారు. పాక్షికంగా దెబ్బ తిన్న చేపల వలకు రూ.3 వేలు చొప్పున, పూర్తిగా దెబ్బతిన్న వలకు రూ.4 వేలు చొప్పున ఆర్థిక సాయం మంజూరు చేస్తారు. చేపల సాగు ఒక హెక్టార్ విస్తీర్ణం నష్టానికి రూ.10 వేలు చొప్పున పరిహారం మంజూరవుతుందని ప్రకటించారు.

పాడి పశువులకు పరిహారం

వరద తాకిడితో నష్టాలు సంభవించిన పాడి రైతులకు పరిహారం ప్రకటించారు. ఒక్కొక్క ఆవు, గేదెకి రూ.37,500, ఒక్కొక్క మేక, గొర్రెకి రూ.4 వేలు చొప్పున పరిహారం చెల్లిస్తారు. బండ్లు లాగే ఎడ్లు, బర్రెలు వంటి పశువుల నష్టానికి రూ.32 వేలు చొప్పున, దూడలు, గాడిద వంటి పశువుల నష్టానికి రూ.20 వేలు చొప్పున నష్ట పరిహారం నిర్ధారించారు. పశువులశాల పునరుద్ధరణ కోసం రూ.3 వేలు ఆర్థిక సాయం అందజేస్తారు. ఒక్కో కుటుంబానికి అత్యధికంగా 3 పెద్ద పాడి పశువులు లేదా 30 చిన్న పాడి పశువులు లేదా బండ్లు లాగే 3 పెద్ద పశువులు లేదా 6 చిన్న పశువులకు పరిహారం పరిమితం అవుతుందని స్పష్టం చేశారు.

చేనేత వర్గాలకు సాయం

వరద పీడిత చేనేత, హస్తకళ వర్గాలకు ముఖ్యమంత్రి సాయం ప్రకటించారు. ఈ వర్గపు యంత్ర పరికరాలు, పనిముట్ల నష్టానికి ఒక్కో వ్యక్తికి రూ.5 వేలు, అనుబంధ సరంజామా నష్ట పరిహారం కింద రూ.5 వేలు చొప్పున ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు.

అపార నష్టం

బాలాసోర్ జిల్లాలో వరదలతో రహదారులు, స్తంభాలు, పాఠశాలలు, ప్రాథమిక, సామూహిక ఆరోగ్య కేంద్రాలు, 11 కేవీ విద్యుత్ వ్యవస్థ, తాగు నీరు పంపిణీ వ్యవస్థ, లఘు సాగు నీటి ప్రాజెక్టులు యువజన కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఇతరేతర కట్టడాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. అనుబంధ విభాగాలు, శాఖల క్షేత్ర స్థాయి నివేదిక ఆధారంగా వీటి పునరుద్ధరణ కోసం సముచిత ప్యాకేజీ ప్రకటించడం జరుగుతుందని ముఖ్యమంత్రి వివరించారు.

అక్రమంగా ఇసుక తరలింపు



వంశధార నది నుంచి ఇసుక తీస్తున్న దృశ్యం

- ఆంధ్రప్రదేశ్‌కు చెందిన లారీలు అడ్డగింత

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ గుడారి ప్రాంతంలో తురుముకుని, బయినాగుడ గ్రామాల సమీప వంశధార నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా అవుతోందని, దీంతో తమ గ్రామాలకు ముంపు ఏర్పడే పరిస్థితి పొంచి ఉందని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. దీనిలో భాగంగా ఇసుక ర్యాంప్‌ల నుంచి ఇసుకను తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 15 లారీలను అడ్డగించారు. ఇసుకను తరలించేందుకు నిరాకరించారు. లారీలు గ్రామాల్లో నిలిపివేసిన అనంతరం ఓఎంసీ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు. మంగళవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్పందించిన తహసీల్దార్ లీలావతి ఆచార్య, ఓఎంసీ అధికారి పరశురాం ప్రధాన్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాన్ మాట్లాడుతూ గుడారి సమీపంలోని ఇసుక రీచ్‌కు సంబంధించి 15 క్యూబిక్ మీటర్ల ఇసుకను వినియోగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, అయితే దీనికి మించి ఇసుక రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు దర్యాప్తు చేపడుతున్నామన్నారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి అనుమతులను ఉల్లంఘించినట్లయితే అందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే తరచూ ఇసుకను పొరుగు రాష్ట్రమైన ఆంధ్రాకు తరలిస్తుండడంతో ఇకపై తమ గ్రామాల నుంచి ఇసుకను రవాణా చేసేందుకు అంగీకరించమని స్థానికులు స్పష్టం చేశారు.



ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

బర్డ్ ఫ్లూ ముప్పు తొలగింది

- ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా

భువనేశ్వర్: రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ ముప్పు తొలగిందని, ప్రజలు యథాతథంగా కోడి మాంసం, గుడ్లు వినియోగించవచ్చని ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నీలకంఠ మిశ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో హెచ్5ఎన్1 సంక్రమించడంతో కోళ్లని పూడ్చేసి మాంసం, గుడ్లు విక్రయం, వినియోగంపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ప్రధానంగా పూరీ, కేంద్రాపడా జిల్లాల్లో బర్డ్ ఫ్లూ తీవ్ర కలకలం రేపింది. జాతీయ పశు వైద్య నిపుణుల బృందం ప్రభావిత ప్రాంతాలను సందర్శించి ఈ పరిస్థితి నివారించేందుకు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. జాతీయ నిపుణుల బృందం మార్గదర్శకాల మేరకు చేపట్టిన కార్యాచరణ విజయవంతంగా పూర్తయ్యింది. బర్డ్ ఫ్లూ సోకిన కోళ్లని పూర్తిగా పూడ్చేయడంతో ఈ విపత్తు తొలగిపోయింది. ఇక నుంచి యథాతథంగా కోడి మాంసం, గుడ్లు వినియోగించవచ్చని పేర్కొన్నారు. నిపుణుల వర్గం ఆంక్షలు విధించడంతో రాష్ట్రంలో కోడి మాంసం, గుడ్ల ధరలు గణనీయంగా దిగజారడంతో వ్యాపారాలు నష్టాల్లో కూరుకుపోయాయి. అయితే ఇప్పుడు మరలా యథాస్థితికి పరిస్థితి చేరకుంటుందని వ్యాపారులు ఆశిస్తున్నారు.

కాలుష్య నివారణకు చర్యలు



సమావేశంలో పాల్గొన్న డీసీపీ ప్రతీక్ సింగ్

- దుర్గా పూజల్లో డీజే నిషేధం
- డీసీపీ ప్రతీక్ సింగ్

భువనేశ్వర్: ఈ ఏడాది దుర్గా దేవి పూజలు పురస్కరించుకుని పర్యావరణం, పరిసరాలకు ఏమాత్రం అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేయాలని నగర పోలీసు కమిషనరేట్ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలో నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నగర మేయర్, పూజా వేడుకల నిర్వహణ కమిటీ ప్రతినిధులు ఇతర అనుబంధ వర్గాలతో నగర డీసీపీ ప్రతీక్ సింగ్ సమావేశమయ్యారు. ఈ సమావేశానికి జట్నీ, భువనేశ్వర్ ఉత్తర, మధ్య మరియు ఏకామ్ర నియోజకవర్గాల ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అలాగే శబ్ద కాలుష్య నివారణకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా దేవీ పూజా పందిళ్ల ప్రాంగణంలో డీజేలు పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. అలాగే అధిక శబ్దం చేసే బాణాసంచా కాల్చడం కూడ నివారించనట్లు పేర్కొన్నారు. రాత్రి 10 గంటల తర్వాత పూజా పందిళ్లలో మైక్ సంబంధిత వినియోగం ముగించాలని తెలిపారు. రావణ కాండ పురస్కరించుకుని అధిక కాలుష్య బాణాసంచా వినియోగం నివారించడం అనివార్యంగా పేర్కొన్నారు.

అక్రమ మద్యంపై నిఘా

శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా అక్రమ మద్యం విక్రయాలపై పటిష్ట నిఘా ఉంటుందని హెచ్చరించారు. ఎక్సైజ్ విభాగం ఈ మేరకు చర్యలు చేపడుతుంది. దేవీ పూజల నిర్వహణ కోసం పందిళ్ల ఏర్పాటుకు సంబంధించిన అనుమతుల వ్యవస్థని సరళీకరించారు. సింగిల్ విండో వ్యవస్థతో పూజా పందిళ్ల ఏర్పాటు, అణుపు ఊరేగింపు కార్యకలాపాలకు అనుమతులు మంజూరవుతాయి. నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది 171 దుర్గాదేవి పూజా పందిళ్లు ఏర్పాటు అవుతున్నాయి.

భరత్‌పూర్ దర్యాప్తు ముమ్మరం

భువనేశ్వర్: భరత్‌పూర్ పోలీసు ఠాణా సంఘటనపై దర్యాప్తు ముమ్మరమైంది. ఈ ఘటనపై ఏకసభ్య న్యాయ విచారణకు ఆదేశాలు జారీ కావడంతో క్రైం శాఖ దర్యాప్తు పుంజుకుంది. బుధవారం క్రైం శాఖ దర్యాప్తు బృందం వివాదస్పద భరత్‌పూర్ పోలీసు ఠాణాకు చేరింది. ఈ బృందం ఎదురుగా బాధిత వ్యక్తులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఘటనకు సంబంధించిన పూర్వాపరాలను దర్యాప్తు బృందం వీరితో చర్చించినట్లు సమాచారం. సంచలనాత్మక సంఘటనలో ప్రధాన నిందితుడు భరత్‌పూర్ ఠాణా ఇన్‌స్పెక్టరు ఇన్‌చార్జి. ఆయనను స్థానిక సబ్ డివిజనల్ జ్యూడిషియల్ మేజిస్ట్రేటు కోర్టులో బుధవారం ప్రవేశపెట్టారు. దర్యాప్తు ప్రక్రియ క్రమబద్ధీకరించే దిశలో ఉన్నతమైన మార్గదర్శకాలతో విచారణ కొనసాగించేందుకు క్రైం శాఖ న్యాయస్థానం అనుమతి అభ్యర్థించింది. ఈ శాఖ అభ్యర్థనపై నిందిత ఠాణా అధికారి సుముఖం వ్యక్తం చేశారు. పాలీగ్రాఫ్, నార్కో విశ్లేషణ, బ్రెయిన్ మ్యాపింగ్ వంటి కీలకమైన పరీక్షలు నిర్వహించేందుకు క్రైం శాఖ యోచిస్తోంది. బాధితుల సమన్వయంతో ఘటనా స్థలంలో సంఘటనల పూర్వాపరాలకు సంబంధించి బలమైన ఆధారాలు సేకరించేందుకు దర్యాప్తు బృందం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. న్యాయస్థానం అనుమతి కోసం నిరీక్షిస్తున్నారు. ఈ సంఘటనలో బాధిత మహిళకు ప్రత్యేక భద్రత కల్పించారు. ఆమెకి ప్రత్యేక రక్షణ అధికారిని నియమించారు.

ఎస్‌డీజేఎం కోర్టు అనుమతి

భరత్‌పూర్ ఠాణా ఇన్‌చార్జి సమ్మతి మేరకు క్రైం శాఖ దర్యాప్తు బృందం అభ్యర్థనని స్థానిక సబ్ డివిజినల్ మేజిస్ట్రేటు కోర్టు బుధవారం అనుమతించింది. పాలిగ్రఫీ, నార్కో విశ్లేషణ, బ్రెయిన్ మ్యాపింగ్ పరీక్షలను గుజరాత్ గాంధీ నగర్ ఎస్ఎఫ్ఎస్ఎల్ సంస్థలో నిర్వహించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ సన్నాహాలు నాలుగు గోడల మధ్య ప్రక్రియ కావడంతో ప్రత్యక్ష సాక్ష్యాలు సాధ్యం కాదు. వైజ్ఞానిక పద్ధతులతో ఈ పరిస్థితిని అధిగమించాలని న్యాయస్థానం తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ప్రమాద స్థలంలో ట్రాక్టర్ వద్ద దర్యాప్తు జరుపుతున్న పోలీసులు

జయపురం: సదర్ పోలీసుస్టేషన్ పరిధి కలియగాం సమీపంలో మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మరణించిన వ్యక్తి మహదొలాయిపుట్‌కు చెందిన సంతోష్ హరిజన్‌గా గుర్తించారు. సంతోష్ హరిజన్ తన బంధువుతో మంగళవారం సాయంత్రం బైక్‌పై జయపురం వచ్చారు. వారు పనులు పూర్తి చేసుకొని తిరిగి తమ గ్రామానికి బయల్దేరారు. ఆ సమయంలో మార్గంలో రోడ్డు పక్కన కలప లోడుతో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను అదుపు తప్పి ఢీకొన్నారు. ప్రమాదంలో సంఘటన స్థలంలోనే సంతోష్ హరిజన్ మృతి చెందాడు. అతడితో పాటు బైక్ పై వచ్చిన వ్యక్తి తీవ్రంగా గాయపడడంతో జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే గగణాపూర్ పోలీసు పంటి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు. బుధవారం పోస్టుమార్టం పూర్తైన తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు వెల్లడించారు.

రాష్ట్రానికి భారీ వర్ష సూచన

భువనేశ్వర్: రాష్ట్రంలో రానున్న 48 గంటల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని స్థానిక వాతావరణ కేంద్రం తెలిపింది. బంగాళాఖాతంలో అల్ప పీడనం ప్రభావంతో పశ్చిమ మధ్య బంగాళా ఖాతం, ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా ప్రాంతాల్లో వర్ష వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. బంగాళా ఖాతంలో తుపాను వాతావరణం క్రమంగా బలపడుతున్నట్లు వెల్లడించారు.

నేడు, రేపు భారీ వర్షాలు

అల్పపీడనం ప్రభావంతో ఈనెల 26, 27 తేదీల్లో రాష్ట్రంలో 7 నుంచి 11 సెంటీ మీటర్ల వరకు భారీ వర్షం కురిసే సంకేతాలు జారీ అయ్యాయి. బాలాసోర్, భద్రక్, మయూర్‌భంజ్, కెంజొహర్, అంగుల్, ఢెంకనాల్, దేవ్‌గడ్, సంబల్‌పూర్, ఝార్సుగుడ, సుందరగడ్, బర్‌గడ్, నువాపడా, బొలంగీరు, బౌధ్, సోన్‌పూర్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్, పూరీ, జాజ్‌పూర్, కటక్, ఖుర్దా జిల్లాలకు భారీ వర్ష సూచన ముందస్తుగా జారీ అయింది.

దొంగలను పట్టుకున్న గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సమితి లిమాపాడ గ్రామానికి చెందిన సుభాషిణి దాస్ అనే వృద్ధ మహిళ చెవిదిద్దులు దొంగతనం చేసిన కేసులో ఇద్దరు నిందితులను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ కేసుకు సంబంధించి అదుపులోకి తీసుకున్నవారిని విచారిస్తున్నామని గుణుపూర్ ఆదర్శ పోలీస్‌స్టేషన్ ఐఐసీ ఉత్తమ్ కుమార్ సాహు తెలియజేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 23వ తేదీన లిమాపాడ గ్రామానికి చెందిన సుభాషిణి దాస్ అనే వృద్ధ మహిళ పొలం పనులు పూర్తి చేసుకుని ఇంటికి వస్తున్న సమయంలో, మార్గ మధ్యలో గుర్తు తెలియని దుండగులు ఆమెపై దాడి చేసి చెవిదిద్దులను తెంపుకు వెళ్లిన సంగతి తెలిసిందే. దుండగులు కంగారులో ఘటన స్థలం వద్ద బైక్ విడిచిపెట్టి వెళ్లిపోయారు. దీంతో బాధితురాలి కుమారుడు ఆ బైక్‌ను తమ ఇంటికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి బైక్‌ను తిరిగి తీసుకెళ్లేందుకు వచ్చిన ఇద్దరు దుండగులను గ్రామస్తుల సాయంతో సంతోష్ పట్టుకుని పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. నిందితుల్లో ఒకరు అకుసింగి గ్రామానికి చెందిన కిరణ్ బిడికగా గుర్తించగా, మరొక వ్యక్తి తన పేరు సరిగా చెప్పడం లేదు. పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.



గ్రామస్తులకు పట్టుబడిన నిందితులు



బాధితురాలు సుభాషిణి దాస్

సమీకృత వ్యవసాయ పద్ధతులతో మేలు



శిబిరంలో పాల్గొన్న రైతులు

పర్లాకిమిడి: సమీకృత వ్యవసాయ పద్ధతులతో రైతులకు మేలు జరుగుతుందని జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి సురేంద్రనాథ్ స్వయిని అన్నారు. స్థానిక కలెక్టరేట్ వద్ద గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్ర భవనంలో రైతుల శిక్షణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాశీనగర్‌లోని ఒక రైతు పది మీటర్లు పొడవు, మూడు మీటర్ల వెడల్పు గల చెరువులో చేపలు, బాతులు పెంచుతూ, చెరువు గట్టుపై కాయగూరల పంటలు సాగుచేస్తూ లాభపడుతున్నాడని తెలియజేశారు. తక్కువ నీటి వనరులు ఉన్న గుమ్మా ప్రాంతంలో కొండ వాగుల నుంచి వచ్చే నీటిని సంరక్షించి, చేపలు, రొయ్యలు, కోళ్ల పెంపకం చేపట్టవచ్చని జిల్లా ఉద్యానవనాల శాఖ ఉపసంచాలకులు సుశాంత రంజన్ దాస్ అన్నారు. శిబిరంలో ఉద్యానవనాల ఉప సంచాలకులు సుశాంత రంజన్ దాస్, వాటర్ షెడ్, జల సంరక్షణ ప్రాజెక్టుల డైరెక్టర్ సురేష్ పట్నాయిక్, సబ్ డివిజనల్ ప్రాణి చికిత్సా అధికారి డాక్టర్ రమాకాంత రోణా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ముఖ్య వ్యవసాయ అధికారి సురేంద్రనాథ్ స్వయిని

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం

రాయగడ: ఇంటిపై పిడుగు పడిన ఘటనలో ఇంట్లో నిద్రిస్తున్నవారికి త్రుటిలో ప్రమాదం తప్పింది. జిల్లాలోని బిసంకటక్ సమితి శంకురుపడ గ్రామంలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. హరి ఉలక ఇంటిపై పిడుగు పడడంతో పైకప్పు విరిగిపడింది. కానీ ఇంట్లో ఉన్నవారికి ఏమీ అవ్వకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అదేవిధంగా గ్రామానికి చెందిన సుధీర్ బెహర మట్టి గోడ కూలిపోయింది.

అక్టోబర్ 6 నుంచి వాలీబాల్ పోటీలు

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో అక్టోబర్ 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నామని కలెక్టర్ బిజయకుమార్ దాస్ తెలియజేశారు. పోటీలకు ఔత్సాహిక క్రీడాకారులు అండర్–14, అండర్–17 జట్ల మధ్య పోటీలు ఉంటాయని, గెలిచిన విజేతలకు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. క్రీడాకారుల ఎంపిక, ప్రోగ్రాం, వైద్య, రవాణా తదితర విషయాలపై వివిధ కమిటీలు ఏర్పాటు చేయాల్సిందిగా సంబంధిత శాఖలను ఆదేశించారు.

నగర పరిశుభ్రతపై నాటక ప్రదర్శన


కోర్టు ఆవరణలో విద్యార్థులతో అధికారులు

మల్కన్‌గిరి: స్థానిక సెంట్రల్ స్కూల్ విద్యార్థులు కోర్టు వద్ద నగర పరిశుభ్రతపై నాటక ప్రదర్శన చేపట్టారు. దీనిలో భాగంగా అపరిశుభ్రత వలన ఎటువంటి అనర్థాలు జరుగుతాయో వివరించారు. నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు జడ్జి రుద్ర ప్రకాష్ నాయక్, సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ కైలాష్ మీన తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు

జయపురం: అనుమతులు లేకుండా నాటుసారా తయారు చేస్తున్న బట్టీలపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు చేపట్టారు. జయపురం సమితి కొలాగుడ, గొడాపాదర్, నీలాగుడ ప్రాంతాల్లో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో నీలాగుడ సమీప అడవిలో దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ విభాగ ఇన్‌స్పెక్టర్ శశికాంత దత్త వెల్లడించారు. ఈ దాడిలో 200 లీటర్ల నాటుసారా, సారా తయారు చేసేందుకు సిద్ధం చేసిన 6 వేల లీటర్ల ఇప్పఊట పారవేసినట్లు వెల్లడించారు. పారవేసిన సారా, ఇప్పఊటల విలువ రూ.3.20 లక్షలు ఉంటుందని వెల్లడించారు. సారా వంటకానికి వినియోగించే సామాన్లు సీజ్ చేసినట్లు వెల్లడించారు.

బంగాళ దుంపల పంట పరిశీలన

జయపురం: బీహార్ రాష్ట్రంలోని నలందా రైతు బృందం ప్రతినిధులు బుధవారం కొరాపుట్ జిల్లాలో బంగాళాదుంపల పంట పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. లమతాపుట్ సమితి పాలిబ ప్రాంతంలో కొరాపుట్ ఫార్మర్స్ అసోసియేషన్ నేతృత్వంలో పర్వత ప్రాంతాల్లో ఖరీఫ్ సీజన్‌లో పండిస్తున్న బంగాళా దుంపల పంట పొలాల్లో తిరిగి గిరిజనులు పండించే విధానాలను ప్రశంసించారు. కొరాపుట్ రైతులు అతి తక్కువ రసాయనిక ఎరువులు వినియోగించడం వలన భూసారం పరిరక్షించబడుతోందని రైతు ప్రతినిధి అశోక్ కుమార్ అభిప్రాయపడ్డారు. బీహార్ రైతుల బంగాళాదుంపల దిగుబడి కన్నా కొరాపుట్‌లో కొంత తక్కువగా ఉన్నా, రసాయినిక ఎరువుల వినియోగం 5 శాతం తక్కువగా ఉండడం అభినందనీయమన్నారు. కొరాపుట్ జిల్లాలో పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో 650 మంది రైతులు ఇంటర్నేషనల్ పొటాటో సెంటర్ ద్వారా పంటలు పండిస్తున్నట్లు రాష్ట్రస్థాయి పొటాటో ప్రాజెక్టు నిర్వాహకుడు సాహిద్ అలీ వెల్లడించారు.

వేతనాలు చెల్లించాలని ఆందోళన


బీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయగడ: తమకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జీపీఎల్‌ఎఫ్ (గ్రామ పంచాయతీ లెవెల్ ఫెడరేషన్) కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు కార్యకర్తలంతా కలిసి బుధవారం స్థానిక సమితి కార్యాలయం ఎదుట తమ నిరసనను తెలియజేసి, బీడీవో అమూల్య కుమార్ సాహుకు వినతిపత్రం సమర్పించారు. ఐదేళ్లుగా పంచాయతీ స్థాయిలో విధులు నిర్వహిస్తున్నామని, అయితే గత ఆరు నెలలుగా సంబంధిత శాఖ వేతనాలు చెల్లించలేదని పేర్కొన్నారు. వారం రోజుల్లో తమ వేతనాలు చెల్లించకపోతే ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీపీఎల్‌ఎఫ్ సంఘం అధ్యక్షురాలు రంభా తాడింగి, కార్యదర్శి సుమిత్ర తురుఖ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు


సీఎస్ ఆహుజా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

- రూ.4,954.26 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు ఆమోదం
- ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా వెల్లడి

భువనేశ్వర్: రాష్ట్రంలో భారీగా పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, యువతకు గణనీయంగా ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా తెలిపారు. ఆయన అధ్యక్షతన స్థానిక లోక్‌సేవ భవన్‌లో రాష్ట్రస్థాయి సింగిల్ విండో క్లియరెన్స్ అథారిటీ (ఎస్‌ఎల్‌ఎస్‌డబ్ల్యూసీఏ) సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో రూ.4,954.26 కోట్ల విలువైన 31 ప్రాజెక్ట్‌లను ఆమోదించినట్లు ఆయన తెలిపారు. దీనివలన దాదాపు 24,162 ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి రానున్నట్లు పేర్కొన్నారు.

ముఖ్యమైన ప్రాజెక్టుల వివరాలు

- ఖుర్దాలో సంవత్సరానికి 3,000 యూనిట్ల సామర్థ్యం కలిగిన పోలిమిరోయిర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పారిశ్రామిక ఉక్కు రోలర్ల ఉత్పత్తి కోసం రూ.128 కోట్ల పెట్టుబడితో ముందుకు వచ్చింది. దీని ఏర్పాటుతో 200 ఉద్యోగాలు లభిస్తాయి.
- మెకానికల్, ఎలక్ట్రికల్ క్యాపిటల్ గూడ్స్ తయారీకి ఖుర్దాలో సౌకర్యాన్ని నెలకొల్పడానికి డానియెలి ఇండియా లిమిటెడ్ రూ.190 కోట్ల పెట్టుబడితో ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. దీనివలన 380 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ప్రతిపాదించింది.
- పార్థ్ ఎలక్ట్రికల్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 51 కోట్ల పెట్టుబడితో ఖుర్దాలో ఎలక్ట్రికల్ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటుతో 145 మందికి ఉద్యోగాలు కల్పించనుంది.
- ఖుర్దాలో బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.95 కోట్ల పెట్టుబడితో పానీయాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు ప్రతిపాదనకు అనుమతించడంతో 426 మందికి ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయి.
- కటక్‌లో జై భారత్ స్పైసెస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 50 కోట్ల పెట్టుబడితో కార్న్ స్టార్చ్ తయారీ యూనిట్ ఏర్పాటుతో 200 మందికి ఉద్యోగాలను సృష్టిస్తుంది.
- జీఏకే రైస్ ప్రైవేట్ లిమిటెడ్ 1,44,000 టీపీఏ సామర్థ్యంతో జగత్‌సింగ్‌పూర్‌లోని ఆధునిక ఇంటిగ్రేటెడ్ రైస్ మిల్లు ఏర్పాటు చేస్తుంది. దీని కోసం రూ.70.15 కోట్లు పెట్టుబడి పెడుతోంది. 95 ఉద్యోగాలను అందిస్తుంది.
- షాలిమార్ గ్లాస్ వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఖుర్దాలో 1,09,500 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో ప్యాకేజింగ్ కంటైనర్ గ్లాస్ తయారీ యూనిట్‌ను రూ.475.54 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేసి, 450 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది.
- ఖుర్దాలో రూ.130 కోట్ల పెట్టుబడితో డెనిమ్ టెక్స్‌టైల్ మరియు గార్మెంట్స్ తయారీ యూనిట్ 4,500 ఉద్యోగాలు, రూ. 53 కోట్ల పెట్టుబడితో ఖుర్దాలో త్రిపథగ టెక్స్‌టైల్స్ రెడీమేడ్ గార్మెంట్ తయారీ యూనిట్ 1,500 మందికి ఉద్యోగాలు కల్పిస్తాయి.
- రూ.200 కోట్ల పెట్టుబడితో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) బర్గఢ్‌లో కంప్రెస్డ్ బయోగ్యాస్ మరియు సేంద్రీయ ఎరువుల కర్మాగారం ఏర్పాటుతో 30 మందికి, రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ సోన్‌పూర్ మరియు సంబల్‌పూర్ ప్రాంతాల్లో రూ.121.21 కోట్ల పెట్టుబడితో రెండు ప్లాంట్ల ఏర్పాటుతో 138 మందికి, రూ.80 కోట్లు పెట్టుబడితో సూర్య ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రైజ్ ప్రైవేట్ లిమిటెడ్ సోలార్ మాడ్యూల్స్ మరియు సంబంధిత ఉత్పత్తుల తయారీ సంస్థ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి 769 మందికి ఉద్యోగాలు కల్పిస్తుంది.

● ఆయుధ ప్రదర్శన





బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) నిర్వహించిన సాంప్రదాయ అయుధ ప్రదర్శనని విద్యార్థులు వీక్షించారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహా విద్యాలయంలో 180వ బీఎస్ఎఫ్ బెటాలియన్ ప్రత్యేక ఆయుధ ప్రదర్శన బుధవారం నిర్వహించింది. దీనిలో భాగంగా అధునాత రాకెట్ లాంచర్లు, మెషిన్ గన్స్, రాత్రి పూట వీక్షించే బైనాక్యులర్స్ తదితర ఆయుధాలు వీక్షించే అవకాశం కల్పించారు. వీటి వినియోగం గురించి సైనికులు సందర్శకులను వివరించారు. ఈ ప్రాంతానికి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పెద్ద ఎత్తున పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. – కొరాపుట్

లైంగిక దాడి కేసులో యువకుడు అరెస్టు


అరెస్టైన నిందితుడు బాధల్ మండల్

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 15 గ్రామానికి చెందిన 19 ఏళ్ల బాధల్ మండల్ అనే యువకుడిని లైంగిక దాడి కేసులో పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికపై ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాధల్ మండల్ మంగళవారం ఉదయం అత్యాచారం చేశాడు. అనంతరం ఎవరికీ చెప్పకూడదని బాలికను భయపెట్టాడు. దీంతో బాలిక భయంతో ఎవరికీ చెప్పకుండా ఆరోజు సాయంత్రం పురుగుల మందు తాగింది. అనంతరం స్పృహ తప్పిపోయి పడిపోయిన బాలికను తల్లిదండ్రులు గమనించి కలిమెల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెకు చికిత్స అందజేశారు. అనంతరం బాలిక అత్యాచారం విషయం తెలియజేయడంతో వెంటనే యువకుడిపై కలిమెల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి, మెరుగైన వైద్యం కోసం కొరాపుట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం బుధవారం సాయంత్రం బాధల్‌ను అతడి ఇంట్లో నిద్రపోతున్న సమయంలో అరెస్టు చేశారు. గురువారం కోర్టులో హాజరు పరుస్తామని ఐఐసీ చంద్రకాంత్ తండి తెలిపారు.

పౌర సరఫరాల శాఖ అధికారుల దాడులు


వివరాలు వెల్లడిస్తున్న భగవతి సాహు

పర్లాకిమిడి: పట్టణంలోని కాశీనగర్‌లో అదనపు పౌరసరఫరాల శాఖ అధికారులు 6వ వార్డు రేషన్ డీలర్ ఇంట్లో బుధవారం దాడులు చేపట్టి 15 ప్యాకెట్ల రేషన్ బియ్యం (70.020 క్వింటాళ్లు), 37 క్వింటాళ్ల రాగుల బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన రేషన్ డీలరు శ్రీనివా సరావుపై ఇంతకుముందు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదులు నమోదయ్యాయి. దీంతో అధికారులు దాడులు చేపట్టారు. జిల్లా కలెక్టర్ పౌర సరఫరాల టాస్క్‌ఫోర్సు ఏర్పాటు చేసిన నెల రోజుల్లో గజపతి జిల్లాలో అనేక మంది రేషన్ డీలర్లపై దాడులు జరిపి సుమారు రూ.1,40,000 లను జరిమానా కింద వసూలు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికారి భగవతి సాహు తెలియజేశారు. పట్టుబడిన రేషన్ డీలర్ లైసెన్స్ రద్దుకు సిఫారసు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

రైల్వే ఉద్యోగం పేరుతో మోసం

- ఒకరు అరెస్టు


అరెస్టైన నిందితుడు

మల్కన్‌గిరి: రైల్వే ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోసం చేసిన వ్యక్తిని జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని ఎంవీ 2 గ్రామానికి చెందిన ప్రగ్య ప్రియదర్శిణి అనే యువతి వద్ద రైల్వేలో క్లర్క్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి సంతోష్ అనే వ్యక్తి 2022లో రూ.7 లక్షలు తీసుకున్నాడు. అనంతరం ఆమెకు ఫేక్ ఆర్డర్ పత్రాలు ఇచ్చారు. కాగా అది ఒరిజినల్ కాదని తెలుసుకున్న ప్రియదర్శిణి డబ్బులు తిరిగి ఇవ్వమని సదరు వ్యక్తిని అడిగింది. అయితే అతను తప్పించుకొని తిరుగుతుండడంతో ఈనెల 9వ తేదీన మల్కన్‌గిరి పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఐఐసీ రీగాన్ కీండో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దీనిలో భాగంగా సంతోష్ జయపూర్‌లో ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు. విచారణ అనంతరం కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గం సభ్యులు

రాయగడ: గుణుపూర్, గజపతి ప్రాంతాల ట్రాక్టర్ల యజమానుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. సంఘం అధ్యక్షుడిగా గాయిగాయి దొలొబెహర, ఉపాధ్యక్షుడిగా జుబలీస్ రయిత, కార్యదర్శిగా మార్కస్ దళ్ బెహర, కోషాధికారిగా గగాన సబర్‌లు ఏకగ్రీవంగా ఎన్నికవ్వగా, సంఘం ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా యాకుబ్ రయిత, అనాసిన్ సాబొరొ, అనువార్ సాబొరొ, అవినాష్ సాబొరొ, శిలికా గొమాంగొ, లిబియా గొమాంగొ, ఆమన్ గొమాంగొ, సానసి గొమాంగొ, జుసునద్రసాబొరొలు నియమితులయ్యారు. ట్రాక్టర్ యజమానులు ఇటీవల కాలంలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు సంబంధించి ఈ సమావేశంలో ప్రస్తావించారు. వీటిని పరిష్కరించేందుకు అందరూ సహకరించాలని కోరారు. గుణుపూర్‌లో జరిగిన సమావేశంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి తిరుపతి గొమాంగొ, బృందావన్ బిడిక తదితరులు పాల్గొన్నారు.

పండిత దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి


దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక ఇరదల వీధిలోని బీజేపీ కార్యాలయంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోడూరు నారాయణరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకుడు ఛిత్రి సింహాద్రి, సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, పురపాలక మాజీ చైర్మన్ నృసింహ చరణ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో నవీన్ సమావేశం


నువాపడా జిల్లా బీజేడీ కార్యకర్తలతో నవీన్ పట్నాయిక్

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ సన్నద్ధం అవుతుంది. ఈ నేపథ్యంలో జిల్లాల వారీగా పార్టీ ప్రముఖ కార్యకర్తలతో అధినేత నవీన్ పట్నాయక్ తరచూ సమావేశం అవుతున్నారు. దీనిలో భాగంగా బుధవారం నువాపడా జిల్లా శాఖ వర్గాలతో సమావేశమయ్యారు. ప్రజల బాగోగుల పర్యవేక్షణ నిరంతర ప్రక్రియ కావాలని పిలుపునిచ్చారు.

నర్సుల విధుల బహిష్కరణ ఆందోళన


ఆందోళన చేపడుతున్న నర్సులు

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా నర్సులు విధుల బహిష్కరించి ఆందోళనకు దిగారు. ఈ చర్యకు పాల్పడితే ఒడిశా అత్యవసర సేవలు నిర్వహణ (ఎస్మా) చట్టం కింద చర్యలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా హెచ్చరించింది. ఈ హెచ్చరికను లెక్క చేయకుండా నర్సులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. 10 ప్రధాన డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం పెడచెవి వైఖరి ప్రదర్శించడంతో ఆందోళన అనివార్యమైనట్లు నర్సుల వర్గం పేర్కొంది. అత్యవసర సేవలు మినహా ఇతర సేవలను బహిష్కరించి తొలిదశ ఆందోళన చేపట్టారు. ఈనెల 27 నాటికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విధుల బహిష్కరించి ఆందోళనకు దిగుతామని స్పష్టం చేశారు. ఒడిశా నర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన కొనసాగిస్తున్నారు.

రాంనగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వాల నమోదు ప్రారంభిస్తున్న నారాయణరావు

పర్లాకిమిడి: బీజేపీ నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని స్థానిక ఒకటో వార్డు రాంనగర్‌లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోడూరు నారాయణరావు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కోట్ల పుణ్యావతి, బీజేపీ సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, ఇ.ప్రశాంత్, యువజన మోర్చా నాయకుడు కోట్ల యువరాజ్, పట్టణ బీజేపీ అధ్యక్షుడు వసంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల సేవలు వెలకట్టలేనివి

రాయగడ: వైద్య రంగంలో ఫార్మసిస్టుల సేవలు వెలకట్టలేనివని సీఆర్‌పీఎఫ్ 4 కమాండెంట్ ప్రభాకర్ ఉపాధ్యాయ అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పితామహల్ వద్దనున్న సెంచూరియన్ వర్సిటీ ఫార్మసిస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ డాక్టర్ రాజేష్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

గంజాయిని పట్టించిన ప్రజలు


అడవిలో పట్టుబడిన గంజాయి బస్తాలు

జయపురం: గంజాయి మాఫియాకు సంబంధించిన వ్యక్తులు అడవిలో దాచిన గంజాయి బస్తాలను పోలీసులకు ప్రజలు పట్టించిన ఇచ్చిన ఉదంతం బుధవారం చోటుచేసుకుంది. రాంచీ–విజయవాడ జాతీయ కారిడార్ బొయిపరిగుడ సమీప మంత్రి అంబ బీఎస్ఎఫ్ క్యాంపు ప్రాంతం అడవిలో గంజాయి పట్టుబడింది. అడవి మార్గంలో కొంతమంది వెళ్తుండగా వారికి కొన్ని బస్తాలు కంటపడ్డాయి. అనుమానం వచ్చి బొయిపరిగుడ పోలీసులకు తెలియజేశారు. దీంతో స్టేషన్ ఏఎస్ఐ కృష్ణచంద్ర సెట్టి నేతృత్వంలో పోలీసు టీమ్‌తో ఆ ప్రాంతానికి వెళ్లారు. వారు చుట్టూ పరిశీలించి గంజాయి మూటలను విప్పి చూడగా వాటిలో గంజాయి బయటపడింది. వెంటనే వాటిని స్వాధీన పరచుకొని మేజిస్ట్రేట్ సమక్షంలో తూయించగా 126 కేజీలు ఉన్నట్లు పోలీసు అధికారి దీపాంజళీ ప్రధాన్ వెల్లడించారు. ఈ గంజాయిని అమ్మేందుకు అడవిలో దాచి ఉంచారని ఆమె అభిప్రాయపడ్డారు. తాము దర్యాప్తు జరిపి త్వరలోనే అరెస్టు చేస్తామని దీమా వ్యక్తం చేశారు.

మంత్రి నిత్యానంద శ్రమదానం


చెరువు వద్ద శ్రమదానం చేస్తున్న దృశ్యం

కొరాపుట్: తమ ప్రాంతంలో పరిశుభ్రత కోసం మంత్రి స్వయంగా రంగంలోకి దిగారు. బుధవారం రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి నిత్యానంద గోండో తన స్వస్థలం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణ సమీపంలోని బల్లుగుడ ప్రాంతంలో ఉదయం వాకింగ్‌కు వెళ్లారు. అక్కడ ప్రజలు వినియోగిస్తున్న చెరువు పిచ్చి మొక్కలతో నిండి ఉండడం గమనించారు. వెంటనే పార పట్టుకొని వాటిని తొలగించడం ప్రారంభించారు. ఇది చూసిన స్థానికులు కూడా మంత్రితో జత కలిశారు.

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ


దివ్యాంగ విద్యార్థినికి ట్రైసైకిల్ అందజేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. సమితిలోని అలమిక్ అనే సామాజిక సేవా సంస్థ దివ్యాంగ విద్యార్థులను గుర్తించి వారికి వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు, సర్జికల్ చెప్పులు ఇతర ఉపకరణాలను అందజేసింది. కార్యక్రమంలో సమితి విద్యాశాఖ అధికారి దీప్తిప్రియ సింగ్, సమితి అదనపు విద్యాశాఖ అధికారి కులొరంజన్ సునా, సిబ్బంది దీపక్ రంజన్ మహంతి, ఉపాధ్యాయులు క్రితేశ్వర్ నాయక్, త్రినాథ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని కళాశాలలో ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. భువనేశ్వర్ నుంచి వచ్చిన వైమానిక దళం సార్జెంట్ బిపన్ రౌత్ విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మాన్సీ శేఠి, మల్కన్‌గిరి కాలేజీ ప్రిన్సిపాల్ లింగరాజ్ మిశ్రో తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీసీసీ అధ్యక్షుడి బాధ్యతల స్వీకరణ



విద్యాసాగర్‌కు అభినందనలు తెలియజేస్తున్న పార్టీ నాయకులు

విజయనగరం ఫోర్ట్: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి(డీసీసీ)గా మరిపి విద్యాసాగర్ బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. బూత్ స్థాయి నుంచి కమిటీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గేదెల తిరుపతి, సతీష్‌కుమార్, రమేష్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమణకు చర్యలు తీసుకోవాలి



పాలక రంజిత్ కుమార్

పార్వతీపురంటౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ)పని చేస్తున్న వైద్యులు చేస్తున్న సమ్మె విరమణకు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణమే చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో అంతంతమాత్రంగానే ఉన్న వైద్య సేవలు వైద్యుల సమ్మెతో మరింత దయనీయంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికీ గిరిజన ప్రాంతాల్లో గ్రామగ్రామాన వ్యాధుల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితిలో సమ్మె ఎక్కువ రోజులు కొనసాగితే గిరిజన ప్రాంతాల్లో పేదల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

హోంగార్డు కుటుంబానికి ఇన్సూరెన్సు చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా పనిచేసి ప్రమాదవశాత్తు మరణించిన హోంగార్డు కుటుంబానికి ఏక్సిస్ బ్యాంకు శాలరీ ప్యాకేజ్ స్కీంలో భాగంగా మంజూరైన రూ.38 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఎస్పీ వకుల్ జిందా బుధవారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోం గార్డ్స్ సంక్షేమంలో భాగంగా వేతనాలను శాలరీ ప్యాకేజ్ స్కీమ్‌గా ఏక్సిస్ బ్యాంకు ఖాతాల్లో జమయ్యే విధంగా పోలీసు ఉన్నతాధికారులు గతంలో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ స్కీమ్ ప్రకారం ఎవరైనా హోంగార్డు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు ఏక్సిస్ బ్యాంకు కొంత మొత్తాన్ని ఇన్సూరెన్సుగా అందజేస్తుందన్నారు. విజయనగరం జిల్లా పోలీసుశాఖలో హోంగార్డుగా పని చేస్తున్న జి.వెంకట సత్యం జూలై10న ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌తో మరణించారు.

విశ్రాంత అటవీశాఖ అధికారికి జైలు శిక్ష

చీపురుపల్లి: చెక్కుబౌన్స్ కేసులో విశ్రాంత అటవీశాఖ అధికారి బలివాడ ధనుంజయరావుకు ఏడాది జైలు శిక్ష, రూ.10 లక్షలు జరిమానాను విధిస్తూ చీపురుపల్లి కోర్టు న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్టు ఫిర్యాదుదారు, న్యాయవాది మజ్జి సూరిబాబు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడుతూ విశ్రాంత అటవీశాఖ అధికారి ధనుంజయరావు తన వద్ద రూ.10లక్షలు చొప్పున రెండుసార్లు రూ.20 లక్షలు అప్పు తీసుకుని రెండు చెక్కులు ఇచ్చారన్నారు. ఆయన అప్పుతీర్చకపోవడంతో ఆ చెక్కులను సంబంధిత బ్యాంకులో వేయగా అకౌంట్‌లో డబ్బులు లేకపోవడంతో చెక్కులు చెల్లుబాటుకాలేదన్నారు. దీనిపై చీపురుపల్లి కోర్టును ఆశ్రయించగా నిందితునికి ఏడాది జైలు శిక్ష, రూ.10 లక్షలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు.

టాటా మ్యాజిక్-ఎక్సెల్ ఢీకొని వ్యక్తి మృతి

జియ్యమ్మవలస:టాటామ్యాజిక్, ఎక్సెల్ వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో బుధవారం సాయంత్రం మండలంలోని పెదకుదమ గ్రామానికి చెందిన పైడి కృష్ణ (56) మృతిచెందాడు. ఈ మేరకు ఎస్సై అనీష్ తెలిపిన వివరాల ప్రకారం పైడి కృష్ణ జియ్యమ్మవలస నుంచి గ్రామానికి ఎక్సెల్‌పై వస్తుండగా టాటా మ్యాజిక్ వ్యాన్ ఎదురుగా జోగులడుమ్మ వద్ద ఢీకొనడంతో ప్రమాదం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు ఆడపిల్లలున్నారు. వారిద్దరికీ పెళ్లిళ్లయ్యాయి. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అన్నదాతలో కలవరం

- మరోసారి తుఫాన్ హెచ్చరిక
- మళ్లీ వర్ష సూచనలు..జిల్లాలో పలుచోట్ల వర్షం
- లక్షా 85వేల ఎకరాల్లో కీలక దశలో వరి



పాలకొండ-వీరఘట్టం రహదారిలో అట్టలి వద్ద వరి పంట

పాలకొండ రూరల్: రైతన్నలు ఆరుగాలం కష్టించి సేద్యం చేపడుతున్న వరి పంటలపై వాతావరణం ప్రతికూలత కొనసాగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి వరుణుడి కరుణ అన్నదాతలపై లేకపోయింది. విత్తన కార్తి మొదలు వర్షాలు, దగ్గర దగ్గరలో తుపానులు రైతన్నలను కలవర పెడుతున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన వర్షాల ప్రభావం నుంచి జిల్లా రైతులు కోలుకోలేదు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత కుటుంబాలు అధికం. జిల్లా పరిధిలో ప్రస్తుతం లక్షా 85వేల ఎకరాల్లో వరి సేద్యం కీలక దశకు చేరుకుంది. చాలా చోట్ల వరి చిరుపొట్ట దశలో ఉంది. నిన్న మొన్నటి వరకూ కురిసిన వర్షాల ధాటికి లోతట్టు పొలాల్లోకి చేరిన నీటిని అతి కష్టంపై బయటకు పంపి, పంటను కాపాడుకునేందుకు అదనపు మదుపులు పెట్టి ఎరువులు జల్లి సస్య రక్షణ చేపడుతున్నారు. ఈ క్రమంలో మళ్లీ వర్ష ప్రభావం ఉంటుందన్న వాతావరణ హెచ్చరికలకు తగ్గట్లు వాతావరణంలో సంభవిస్తున్న మార్పులతో పలుచోట్ల వర్షాలు ప్రారంభమయ్యాయి.

కంటిమీద కునుకు లేకుండా..

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో మరో మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ముఖ్యంగా పార్వతీపురం మన్యం జిల్లాలో అత్యధిక వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొనడంతో కర్షకులు కలవర పడుతున్నారు. ఈ ప్రాంత రైతులు సాగునీటి వనరులు ఆసరాగా చేసుకుని 25వేల హెక్టార్లలో జూన్ చివరి వారం నుంచి జూలై మాసాంతం వరకూ వరి వెదలు జల్లారు. ప్రస్తుతం తేలిక రకాలు చిరుపొట్ట దశకు చేరుకున్నాయి. మిగిలిన రైతులు ఆగస్టులో ఉబాలు చేపట్టారు. తాజా వర్షాలను ఆసరాగా చేసుకుని సెప్టెంబర్‌లో మరికొంత మంది నాట్లు వేశారు. ఉబాలు చేపట్టిన పంటలు ప్రస్తుతం దుబ్బు చేస్తున్నాయని రైతులు పేర్కొంటు న్నారు.

ఆందోళనకు గురి చేస్తున్న హెచ్చరికలు..

కీలక దశలో వరుసవర్షాలు, తుపానులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రస్తుత స్థితిలో వర్షం పడినప్పటికీ పొట్టదశలో పంటకు నష్టం అంతగా చేకూరకపోవచ్చు. గాలుల తీవ్రత అధికంగా ఉంటే పంటకు నష్టం తప్పదని రైతులు రైతులు ఆందోళన చెందుతున్నారు.

సర్కారు సాయంపై నమ్మకం లేక..

కూటమి సర్కారు అధికారంలో వచ్చినప్పటికీ రైతులకు ఈ సీజన్‌లో పెట్టుబడి సాయం అందించలేదు. ఉచిత పంట బీమా ఊసే లేదు. ఈ-క్రాప్ నమోదు కొనసాగుతోంది. ఈకేవైసీలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ తరుణంలో రైతుకు అవసరమైన ఎరువులు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేవు. రాయితీ పరికరాలు అందించే యోచన అంతకన్నా లేదు. దీంతో సాధారణ రైతులతో పాటు కౌలు రైతులు సేద్యానికి తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వరుస పెట్టుబడులకు చేతిలో సొమ్ము లేక అప్పులు చేసి పంటలను రక్షించుకుంటున్నారు. తీవ్ర సమస్యలు ఏర్పడి పంటనష్టం కలిగితే సర్కారు సాయం చేసి పరిహారం ఇస్తుందన్న నమ్మకం ఏమాత్రం లేదని రైతులు పెదవి విరుస్తున్నారు.



ఇటీవల కురిసిన వర్షం ధాటికి తుమరాడ వద్ద నీటిలో వరిచేలు

అక్టోబర్‌లో వర్షాలు పడే అవకాశం



వాతావరణ శాఖ సూచనల మేరకు రానున్న అక్టోబర్ నెలలో కూడా వర్షాలు పడే అవకాశం మెండుగా ఉంది. ఈ ప్రభావం రైతులను కష్టాల్లోకి నెట్టేస్తుంది. రుతుపవనాల ప్రారంభం, విరామం నెమ్మదిగా ఉంది. ఈ క్రమంలో అంచనాకు మించిన వర్షపాతం నమోదవుతోంది. ఈ ప్రాంతంలో తరంగిణి, శ్రీధృతి వంటి తేలిక రకాలను రైతులు వేశారు. ఈ పంట కాలం 120 నుంచి 125రోజులు. జూన్ చివరి వారం జూలైలో వేసిన పంటలు వచ్చే నెలలో కోతకు వస్తాయి. ఈ తరుణంలో వర్షాలు, ఈనిక దశలో గాలులతో కూడిన వర్షాలు కురిస్తే నష్టం తప్పదు. దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది.

కండాపు ప్రసాదరావు,
అభ్యుదయ రైతు, రుద్రిపేట, పాలకొండ మండలం

ప్రణాళికలు సమర్పించాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ప్రధాన మంత్రి జాతీయ ఉన్నత్ గ్రామ్ అభియాన్ ప్రణాళికలు సమర్పించాలని కేంద్ర గిరిజన మంత్రిత్వశాఖ అదనపుకార్యదర్శి ఆర్.జయ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆమె కలెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. గిరిజన గ్రామాలలో విద్య, వైద్యం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలపై పూర్తి వివరాలను గురువారంలోగా సమర్పించాలని స్పష్టం చేశారు. గిరిజనుల వైద్యసేవలకు ఉత్తమ ఆస్పత్రిని ఎంపిక చేసి అందుబాటులో ఉన్న వైద్యసేవలు, పరికరాలపై తక్షణం ప్రతిపాదన సమర్పించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ అధికారులతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీవాస్తవ, ఏపీఓ మురళీధర్, డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు, డీఎంహెచ్‌ఓ విజయపార్వతి తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ప్రచారం చేయాలి

స్వర్ణాంధ్ర-2047 క్యూ ఆర్ కోడ్‌పై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో శాఖల వారీగా విజన్ డాక్యుమెంట్‌కు సంబంధించి గణాంకాలను వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ కార్యక్రమంలో భాగంగా గ్రామసభలు నిర్వహించి, గ్రామసభ డాక్యుమెంట్‌ను చదివి వినిపించాలని సూచించారు. రానున్న ఐదేళ్లకు మండల స్థాయి యాక్షన్ ప్లాన్‌ను తయారుచేసి 30వ తేదీనాటికి అందజేయాలని, అక్టోబర్ 1వ తేదీ పెన్షన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శతశాతం పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ.ప్రభాకరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మన్మథరావు, సీపీఓ పి.వీర్రాజు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లు పాల్గొన్నారు.

పండగ వాతావరణంలో పర్యాటక దినోత్సవం

- ఆడలి, అడ్వెంచర్ పార్కు దగ్గర నిర్వహణ
- పోస్టర్ విడుదల చేసిన పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి



టూరిజం పోస్టర్ విడుదల చేస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: ఈ నెల 27న పండగ వాతావరణంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని సీతంపేటలో ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టుఅధికారి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం ఆడలి వ్యూపాయింట్ వద్ద, సాయంత్రం స్థానిక అడ్వెంచర్ పార్కులో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు. ఆడలికి నేచర్స్ బెస్ట్ క్యాన్వాస్ ట్యాగ్‌లైన్‌తో ప్రాచుర్యం కల్పించనున్నామన్నారు. ఆడలి వ్యూ పాయింట్‌తో పాటు రెస్టారెంట్ వంటివి ప్రారంభించనున్నామని తెలిపారు. జీసీసీ, వెలుగు స్టాల్స్ అక్కడ ఏర్పాటు చేయనున్నామని, అలాగే విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలపోటీలు నిర్వహించనున్నామని స్పష్టం చేశారు. అనంతరం టూరిజం పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. మరిన్ని పర్యాటక ప్రాంతాలను సీతంపేటలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో జి.చిన్నబాబు, డీపీవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం రేటు తగ్గించే దిశగా చర్యలు చేపట్టాలి

- ఎస్పీ ఎస్.వి. మాధవ్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి

పార్వతీపురంటౌన్: జిల్లాలో క్రైమ్ రేటు తగ్గించే దిశగా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పోలీసు మల్టీఫంక్షన్ హాల్‌లో బుధవారం ఆయన నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోం గార్డు నుంచి ఐపీఎస్ అధికారుల వరకు ఎంతో శ్రమించి, పోలీసుశాఖ ప్రతిష్టను ఇనుమడింపజేశారని, ఆ ప్రతిష్టను మరింతగా పెంచేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది సత్ప్రవర్తనతో మెలగాలని హితవు పలికారు. పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే నిరుపేదలు, మహిళలు, వృద్ధుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, వారికి అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను శ్రద్ధతో విని, న్యాయం చేసేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీసు అధికారులు, సిబ్బంది వ్యవహార తీరులో మార్పులు చేసుకోవాలని, ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారి పట్ల సానుకూల దృక్పథంలో వ్యవహరించాలని స్పష్టం చేశారు.

సవాలుగా తీసుకోవాలి

గతంలో నమోదైన నేరాల కంటే ప్రస్తుతం కొత్త తరహాలో నేరాలు నమోదవుతున్నాయని, వాటిని సవాళ్లుగా తీసుకుని, పోలీసుల పనితీరు మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయ పడ్డారు. కొత్త తరహాలో నమోదవుతున్న డ్రగ్స్, సైబర్ నేరాలను దర్యాప్తు చేసేందుకు అవసరమైన మెలకువలను పోలీసు అధికారులు అందిపుచ్చుకోవాలని సూచించారు. అందుకు కాలానుగుణంగా వస్తున్న మార్పులను గమనిస్తూ, ఎప్పటికప్పుడు పనితీరును మెరుగుపర్చుకోవా లని సూచించారు. ఈ తరహా నేరాలను నియంత్రించేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజల్లో చైతన్యం నింపేందుకు సోషల్ మీడియాను వినియోగించుకోవాలని అధికారులను సూచించారు. నేర సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ డా.ఒ.దిలీప్ కిరణ్, పార్వతీపురం ఏఎస్పీ సురానా అంకిత మహావీర్, పాలకొండ సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.రాంబాబు, ఎస్బీ సీఐ సీహెచ్ లక్ష్మణ రావు, సీఐలు డి.జి బాబూరావు, అప్పారావు, శ్రీరాములు, శ్రీనివాస్, జిల్లాలో గల సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

భర్తే హతమార్చాడు

సాలూరు రూరల్: మండలంలోని కరాసవలస గ్రామంలో ఈ నెల 20వ తేదీన అనుమానాస్పదంగా మృతిచెందిన కరాసమ్మను తానే హతమార్చినట్లు ఆమె భర్త బొడ్డుదొర శ్రీను పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు రూరల్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ రామకృష్ణ మాట్లాడుతూ శ్రీను 15 ఏళ్ల క్రితం కరాసమ్మను ప్రేమపెళ్లి చేసుకున్నాడని వారికి ఇద్దరు పిల్లలని తెలిపారు. పక్క గ్రామం కొత్తవలసకు చెందిన రాముతో ఆమె వివాహేతర సంబంధం కలిగి ఉందన్న అనుమానంతో భార్యాభర్తల మధ్య కొంతకాలంగా వివాదం రేగుతోంది. ఈ క్రమంలో ఈ నెల 20 వ తేదీన ఆమెను చున్నీతో మెడనులిమి చంపి పరారయ్యాడని, బుధవారం పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బొగ్గులోడులో మృతదేహం ఒడిశా వాసిదే



ఎస్.కోట సీహెచ్‌సీలో మృతదేహాన్ని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామం సమీపంలో గల శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ కర్మాగారానికి ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చిన బొగ్గు లారీలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం ఆదివారం వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఈ మృతదేహాన్ని ఒడిశా రాష్ట్ర వాసిదిగా గుర్తించి మృతుడి కుటుంబసభ్యులకు సీఐ షణ్ముఖరావు బుధవారం అప్పగించారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలోని కటక్‌లో గల శ్రీగణపతి ట్రేడర్స్ బొగ్గు యార్డు నుంచి లారీల్లో బొగ్గును ఇక్కడి కర్మాగారానికి దిగుమతి చేసుకుంటున్నారు. సంబంధిత యార్డులో సీసీ కెమెరాలను పరిశీలించగా ఒక యువకుడు లారీలోకి ఎక్కిన దృశ్యాలు కనిపించాయి. అలాగే మృతుడి జేబులో ఉన్న ఆస్పత్రి ఓపీ చీటీని పరిశీలించగా శంభునాథ్ పరిడియా(40), తండ్రి పేరు సుభాష్‌చంద్రగా ఉంది. బలిచంద్రపుర్ పోలీస్‌స్టేషన్ పరిధి, జాజ్‌పూర్ జిల్లా వాసిగా మృతుడిని గుర్తించి వారి బంధువులకు ఇక్కడి పోలీసులు సమాచారం అందించారు. ఈ మేరకు మృతుడి బంధువులు వచ్చి ఎస్.కోట సీహెచ్‌సీ మార్చురీలో భద్రపరిచిన మృతదేహాన్ని పరిశీలించి తమదేనని గుర్తించగా పోలీసులు వారికి అప్పజెప్పారు. అయితే ఆ వ్యక్తి మతిస్థిమితం లేక బొగ్గు యార్డులో గల లారీ ఎక్కాడా? లేదా ఎవరైనా హతమార్చి లారీలో పడేశారా? అనే అంశాలపై ఒడిశా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన అవతారం

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామానికి చెందిన వర్రి అవతారం(26) అప్పుల బాధతాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండంలోని పెదవేమలికి చెందిన అవతారం తన తాత గారి గ్రామం లక్కిడాంలోని స్నేహితుడి ఇంటికి మంగళవారం వెళ్లాడు. మధ్యాహ్నం స్నేహితుడితో కలిసి భోజనం చేశాడు. అనంతరం బయటకు వెళ్తానని స్నేహితుడు 4 గంటల సమయంలో వెళ్లాడు. నీరసంగా ఉందని పడుకుంటానని చెప్పి అవతారం ఇంట్లోనే ఉండిపోయాడు. మంగళవారం రాత్రి స్నేహితుడు ఇంటికి వచ్చి చూడగా అవతారం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉన్నాడు. ఈ విషయాన్ని పెదవేమలి గ్రామంలోని అవతారం కుటుంబసభ్యులకు సమాచారం అందించగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే ఎస్సై సాయికృష్ణ లక్కిడాంలోని సంఘటన జరిగిన ఇంటికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి విజయనగరం పంపించారు. బుధవారం మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయ్యాక కుటుంబసభ్యులకు అప్పగించారు. అవతారం డిగ్రీ చదువుకున్నాడు. కేటరింగ్ నిర్వహించేవాడు. కేటరింగ్‌లో నష్టం రావడంతో అప్పులు పెరిగిపోయాయి. దీంతో మనస్తాపానికి గురై ఆత్మ హత్యకు పాల్పడ్డాడని రోదిస్తూ..కొడుకు అర్ధాంతరంగా తనువు చాలించడంతో తల్లిదండ్రులు అర్జున్, సత్యవతిలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి సోదరుడు ఉన్నాడు. గంట్యాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆమె నేత్రదానం మరో ఇద్దరి జీవితాల్లో వెలుగు



నేత్రదానం చేసిన అప్పల నరసమ్మ (ఫైల్)

పార్వతీపురంటౌన్: జిల్లాలోని సీతానగరం మండలం అంకలాం గ్రామానికి చెందిన వారణాశి అప్పల నరసమ్మ (82) జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మరణించగా ఆమె నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. ఆమె కుటుంబసభ్యులు ఆస్పత్రి ఆర్ఎంఓ, నేత్ర వైద్య నిపుణురాలు డా.శ్యామలతో నేత్రాలను దానం చేయాలని ఆమె నేత్రాలతో ఇంకొక ఇద్దరికీ కంటి చూపును ప్రసాదించే భాగ్యం తమకు కలిగించాలని కోరారు. దీంతో ఆమె వెంటనే జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి డాక్టర్ నగేష్ రెడ్డిని సంప్రదించి వెంటనే ఏర్పాట్లు చేయమని చెప్పారు. ఆయన వెంటనే విజయనగరం రెడ్ క్రాస్ సంస్థ నేత్ర నిధిని సంప్రదించిన వెంటనే సిబ్బంది బయలుదేరి జిల్లా ఆస్పత్రికి చేరుకుని అప్పలనరసమ్మ కళ్లకు సంబంధించిన రెండు కార్నియాలు సేకరించారు. నేత్రదాత కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకుడు రమేష్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం తీసిన రీల్స్ పిచ్చి





గెడ్డలో నుంచి పవన్ మృతదేహాన్ని బయటకు తీసుకొస్తున్న దృశ్యం, (ఇన్‌సెట్లో) మృతుడు పవన్

గంట్యాడ: సోషల్ మీడియాలో చేసే రీల్స్ మీద మక్కువ ఆ యువకుడి ప్రాణం తీసింది. ఉన్నతంగా చదువుకుని కుటుంబాన్ని ఆదుకోవాల్సిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి గంట్యాడకు చెందిన రాళ్లపూడి పవన్ (17) రీల్స్ చేస్తూ బుధవారం గెడ్డలో జారి పడి మృతిచెందాడు. ఈ విషాద ఘటనకు సంబంధించి వివరాలు పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు ఇలా ఉన్నాయి. మండల కేంద్రం గంట్యాడ ఎస్సీ కాలనీకి చెందిన ఇంటర్మీడియట్ సెకెండ్ ఇయర్ చదువుతున్న నలుగురు విద్యార్థులు, బుడతనాపల్లికి చెందిన ముగ్గురు విద్యార్థులు కలిసి బుడతనాపల్లి గ్రామంలో ఉన్న తుమర గెడ్డకు స్నానాలకు బుధవారం ఉదయం వెళ్లారు. స్నానాల అనంతరం రాళ్లపూడి పవన్ గెడ్డలో దిగి రీల్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయ్యాడు. దీంతో సహచర విద్యార్థులు బుడతనాపల్లి గ్రామస్తులు, గంట్యాడ కాలనీ వాసులకు చెప్పడంతో వారంతా వచ్చి గాలింపు చేపట్టారు. సాయంత్రం 5 గంటల సమయంలో పవన్ మృతదేహం లభ్యం కావడంతో ఒడ్డుకు చేర్చారు. గంట్యాడ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆ ఏడుగురు విద్యార్థులు గంట్యాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నారు. కాలేజీకి వెళ్తానని చెప్పి వెళ్లిన కొడుకు విగతజీవిగా రావడంతో మృతుడి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సాయి కృష్ణ తెలిపారు.


విద్యుత్ షాక్‌తో వ్యక్తి...



విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన కోట రామారావు

తెర్లాం: మండలంలోని అంట్లవార గ్రామంలో బుధవారం సాయంత్రం విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కోట రామారావు(48) బుధవారం సాయంత్రం పొలానికి వెళ్తుండగా పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ సర్వీసు వైరును గమనించకపోవడంతో అది కాలికి తగిలి షాక్ కొట్టి అక్కడిక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య చిన్నమ్మి, ఇద్దరు కుమారులు అనంతరావు, సతీష్ ఉన్నారు. ఈ విషయమై మండల విద్యుత్ ఏఈ సోమేశ్వరరావు వద్ద స్థానిక విలేకరులు ప్రస్తావించగా విద్యుత్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు తాను సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించానని తెలిపారు. గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన విషయం తెలుసుకున్న తెర్లాం ఎస్సై సాగర్‌బాబు సిబ్బందితో సహా సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించారు.

జిల్లా మత్స్య వనరుల అభివృద్ధికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యశాఖ జిల్లా అధికారి తిరుపతయ్య

పార్వతీపురం: జిల్లాలో మత్స్య వనరుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడతామని మత్స్యశాఖ జిల్లా అధికారి వి.తిరుపతయ్య అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రణాళిక డాక్యుమెంటరీ తయారీపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్యకారులు సేంద్రియ విధానంలో చేపల పెంపకం చేపట్టాలన్నారు. జిల్లాలో మొబైల్ ఆక్వా ల్యాబ్ ఏర్పాటుచేయాల్సి ఉందన్నారు. చెరువులను అభివృద్ధిచేయాలని, రివాల్వింగ్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని, మహిళా మత్స్యకార సంఘాలు స్వయం ఉపాధికింద రంగు చేపల పెంపకంపై శిక్షణ ఇవ్వాలని, చేపల నిల్వ కోసం శీతలీకరణ కోసం కోల్డ్ స్టోరేజ్‌లను ఏర్పాటు చేయాలని మత్స్యకార నాయకులు కోరారు. కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ దాసరి లక్ష్మణరావు, పార్వతీపురం, పాలకొండ, సాలూరు మత్స్యకార అభివృద్ధి అధికారులు, మత్స్యశాఖ గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు వల్లాపురం విద్యార్థి



ఆశ్రితను అభినందిస్తున్న హెచ్‌ఎం అప్పారావు, పీడీ తిరుపతిరావు

గుర్ల: మండలంలోని వల్లాపురం హైస్కూల్ విద్యార్థిని చిత్తుల ఆశ్రిత రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరచడంతో జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైందని హైస్కూల్ పీడీ మజ్జి తిరుపతిరావు బుధవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు జట్టు సారథిగా ఉంటూ విజయానికి కృషి చేసి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఆశ్రితను హెచ్‌ఎం వి.అప్పారావు, ఉపాధ్యాయులు అభినందించారు. వచ్చే నెల 3,4 తేదీలలో హైదరాబాద్‌లో జరగబోయే పోటీలలో ఆమె పాల్గొంటున్నట్లు పీడీ చెప్పారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు 64 మంది ఎంపిక



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామ జెడ్పీహెచ్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ అండర్14,17 బాలబాలికల ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 64 మందిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు పీడీలు నల్ల వెంకటనాయుడు, సత్యనారాయణ, అప్పలనాయుడులు తెలిపారు. జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించగా 30 పాఠశాలలకు చెందిన 300 మంది క్రీడారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన ఆయా పాఠశాలలకు చెందిన అండర్-14లో 32 మంది బాలబాలికలు, అండర్-17లో 32 మంది బాలబాలికలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పీడీలు స్పష్టం చేశారు. నవంబరు నెలలో రాష్ట్రస్థాయిలో ఈపోటీలు నిర్వహించనున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారిని ప్రోత్సహిస్తున్నట్లు పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు చెప్పారు.